ప్రజాశక్తి

సోమవారం 27, ఫిబ్రవరి 2023

5

శ్రీ సత్యసాయి



జూడో పోటీలలో ధర్మవరం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చెన్నైలో ఈనెల 19 నుంచి 22 తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి ఎ. జూడో పోటీలో ధర్మవరం విద్యార్థి లక్ష్మీప్రసాద్ ప్రతిభ కనబరచినట్లు జూడో ఎన్ఎస్కోచ్ ఇనాయాతాషా తెలిపారు. చెన్నైలో జాతీయస్థాయి జూడో పోటీల్లో ధర్మవరం ఆర్డీటీ ఆంధ్రప్రదేశ్ తరపున ధర్మవరం విద్యార్థి లక్ష్మీప్రసాద్ పాల్గొని మైనస్ 30 కేజీ అండర్–14క్యాటగిరి విభాగంలో బ్రాంచ్‌మెడల్ సాధించారని కోచ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థిని పాఠశాల హెచ్ఎ మేరివరకుమారి, కోచ్ ఇనాయత్బాషా, సరస్వతి అభివద్ధి కమిటి ప్రసిడెంట్ బండారు ఆదినారాయణ అభినందించారు.




శింగనమల మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-శింగనమల

పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ కోరారు. సిఐటియు, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శింగనమల మండల కేంద్రంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఓబులు, రాంభూపాల్ మాట్లాడుతూ.. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పోతుల నాగరాజు ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిని కూడా వదలుకుని 32 సంవత్సరాలుగా అనేక ఉద్యమాలలో భాగస్వామ్యం అవుతున్నారన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాలకు వినిపిస్తూ నిస్వార్థ ప్రజా సేవకులుగా అందరి ప్రశంశలూ పొందుతున్నారని తెలిపారు. విద్యార్థి నాయకుడిగా, ప్రభుత్వ ఉపాధ్యాయునిగా, సామాజిక కార్యకర్తగా వెనుకబడిన కులాల ఐక్యవేదిక కన్వీనర్‌గా, మహాత్మా ఫూలే చారిటబుల్ ట్రస్ట్ నిరవకునిగా ఆయన పనిచేశారన్నారు. రాయలసీమ అభివృద్ధి కోసం, ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం, పెన్షనర్ల హక్కుల పరిరక్షణ కోసం పనిచేశారన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం జరిగిన అన్ని పోరాటాల్లోనూ క్రియాశీలకంగా పాల్గొన్నారని తెలిపారు. ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్, యుటిఎఫ్, ఎస్‌టియు, జన విజ్ఞాన వేదిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, నిరుద్యోగ, బహుజన మేధావులు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు, సామాజిక ఉద్యమ నేతలు, రచయితలు, జర్నలిస్టులు, కళాకారులు, కార్మికులు, న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజినీర్ల మద్దతుతో మన ముందుకు వస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటిప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సిఐటియు నగర కార్యదర్శి నాగేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, నాగేంద్ర ప్రభాస్, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.



గడిచిన రెండు, మూడేళ్లగా మంచి వర్షాలు పడుతున్నాయి. జిల్లాకు ఏకైక జలవనరుగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా వచ్చే నీటి లభ్యత కూడా పెరిగింది. అయితే ఆ స్థాయిలో ఆయకట్టు సాగులో పెరుగుదల కనిపించకపోగా, తగ్గుతూ వస్తోంది. ప్రధానంగా కాలువల ఆధునీకరణ పనులు ఎక్కడికక్కడ ఆగిపోవడంతో ఆయకట్టుకు నీటి నిర్వహణలో సమస్యలొస్తున్నాయి. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరు అందే పరిస్థితులు కనిపించడం లేదు.

నీరు పెరిగింది.. సాగు తగ్గింది..!

◆ ఏటా తగ్గుతున్న హెచ్ఎల్‌సి ఆయకట్టు ◆ కాలువ నిర్వహణకు నిధుల్లేక తప్పని తిప్పలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు దామాషా పద్ధతిలో 32.50 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. దీనికి అదనంగా కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా మరో 10 టిఎంసిలు జిల్లాకు రావాల్సి ఉంది. మొత్తంగా 42 టిఎంసిల నీరు జిల్లాకు కేటాయింపులున్నాయి. తుంగభద్ర డ్యామ్‌లో పూడిక కారణంగా డ్యామ్ నిలువ సామర్థ్యం 130 టిఎంసిల నుంచి వంద టిఎంసిలకు తగ్గిపోయింది. ఈ మేరకు తుంగభద్ర ఎగువ ప్రధన కాలువకు దామాషా పద్ధతిలో కేటాయింపులు తగ్గిపోయాయి. చివర్లోనూ వర్షాలు రావడంతో నీటి లభ్యత తుంగభద్ర డ్యామ్‌లో గడిచిన రెండేళ్లుగా పెరిగింది. ఆ ప్రకారం నీటి కేటాయింపులు పెరిగాయి. కాని ఇక్కడ జిల్లాలో సాగు విస్తీర్ణం మాత్రం పెరగకపోవడం గమనార్హం.

ఆగిన ఆధునీకరణ

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు ఆగిపోయాయి. దీంతోపాటు మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ ఆగిపోయాయి. వాటి కిందనున్న పంట కాలువల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. ఫలితంగా చివరి ఆయకట్టుకు భూములకు చేరాల్సినంత నీరు చేరడం లేదు. ఫలితంగా సాగు విస్తీర్ణం ఏటా తగ్గుతూపోతోంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద మొత్తం 1.60 లక్షల ఎకారల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది 85398 ఎకరాలే సాగైంది. ఇందులో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ అంటే కణేకల్, బొమ్మనహాళ్ మండలాల పరిధిలో లోకలైజ్డ్ ఆయకట్టు 36292 ఎకరాలుంటే 36281 ఎకరాలు సాగైంది. మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ కింద 33176 ఎకరాల ఆయకట్టు ఉంటే 15660 ఎకరాలు మాత్రమే సాగైంది. ఉత్తర కాలువ కింద 13325ఎకరాలకు గానూ 9687 ఎకరాలు సాగైంది. ఇక తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ కింద 31131 ఎకరాలుంటే ఒక్క ఎకరానికి నీరందలేదు. గుత్తి, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద 32063 ఎకరాలుంటే 16390 ఎకరాలే సాగైంది. మొత్తంగా 85398 ఎకరాలు ఈ ఏడాది సాగైంది. 2018–19 సంత్సరం నుంచి చూస్తే సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా తగ్గిపోతూ వస్తోంది. 2018–19 సంవత్సరంలో లక్ష ఎకరాలకుపైగా సాగయితే ఇప్పుడు అది 85 వేల ఎకరాలకు తగ్గిపోయింది.

సంవత్సరం	జిల్లాకు చేరిన నీరు(టిఎంసిలు)	ఆయకట్టు
2018–19	22.706	105493
2019–20	27.207	108991
2020–21	27.911	98527
2021–22	34.932	87685
2022–23	31.558	85398



ట్రోఫీతో విజేత జట్టు

గ్రామీణ ప్రాంత క్రీడలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి బుక్కపట్నం

గ్రామీణ ప్రాంత క్రీడలను ప్రోత్సహించి వారిలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని ఆదర్శ విద్యాసంస్థల అధినేత పెద్దరాసు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తరచూ క్రీడా పోటీల వలన క్రీడలలో నైపుణ్యాన్ని ప్రావిణ్యతను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఫైనల్ మ్యాచ్ నందు బుక్కపట్నం ఇరగ రాజు పల్లి టీములు పోటీ పడగా బుక్కపట్నం ఈగల్స్ జట్టు విజేతగా నిలిచింది. మొదటి బహుమతిగా 13 వేల రూపాయల నగదు తో పాటు ట్రోఫీ గెల్చుకోగా, రెండవ బహుమతి ఇరగరాజు పల్లి జట్టుకు 9వేల రూపాయలు, మూడవ బహుమతి బత్తలపల్లి జట్టుకు రూ.6వేలతోపాటు షీల్డు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో షామీర్ భాష, సతీష్ కుమార్, బుచ్చయ్య గారి పల్లి చంద్ర నిర్వాహకులు శివ, శ్యామ్, కుబేర్ తదితరులు పాల్గొన్నారు..

పూర్వ విద్యార్థుల ఆర్థిక చేయూత

గోరంట్ల: పట్టణంలో ఎస్ సి ఎ పి ఎస్ జూనియర్ కళాశాలలో 1992 – 94 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థులు గొప్ప మనసును చాటారు. తమతో పాటు చదివిన దస్తగిరి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుంటే అతని కుటుంబానికి స్నేహితులు 5వేల రూపాయలు నగదు ఆదివారం అందజేశారు.

కాలుష్య నివారణపై ప్రజల్లో చైతన్యంరావాలి

సత్యసాయి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకరరావు



ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమాజం వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో అంతే వేగంగా కాలుష్యం పెరుగుతోందని, కాలుష్య నివారణపై ప్రజల్లో చైతన్యం రావాలని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శంకరరావు తెలిపారు. పర్యావరణం క్షీణించి పోవడంతో పాటు కాలుష్యం నానాటికి పెరిగిపోతోందన్నారు. కాలుష్యం పలు రకాలుగా వ్యాపిస్తోందని చెప్పారు. ఆహార కాలుష్యం, నీటి కాలుష్యం, గాలి కాలుష్యంతో ప్రజలు ఆరోగ్యం కోల్పోతున్నారని అన్నారు. సమాజం అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో జీవితమే యాంత్రీకరణ అయిందన్నారు. దీంతో తినే తిండిలో కల్తీ కారణంగా కాలుష్యం జరుగుతోందన్నారు. తాగే నీరు కాలుష్యం, చివరకు పీల్చే గాలి కూడా కాలుష్యంగా మారిపోయిందన్నారు. పర్యావరణం సమతుల్యం లేకపోవడం వల్లనే నానాటికి కాలుష్యం పెరిగిపోతోందన్నారు. ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శంకరరావు పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న : జిల్లాలో కాలుష్య నివారణకు మీరు చేపడుతున్న చర్యలేమిటి ?

జవాబు : పరిశ్రమల నుండి కాలుష్యం వెదజల్లకుండా పర్యవేక్షిస్తాం. పరిశ్రమ పెట్టినప్పుడే వాటి యాజమాన్యం తమ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. లేకుంటే సమీప గ్రామాలు, పట్టణాలకు గాలి, నీటి కాలుష్యం వ్యాపించే ప్రమాదం ఉంటుంది. ప్రభుత్వ నిబంధన మేరకే పరిశ్రమలు నెలకొల్పాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు కాలుష్యం వెదజల్లకుండా తమ శాఖ పర్యవేక్షిస్తూ ఉంటుంది.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి? కాలుష్యాన్ని ఏ విధంగా వర్గీకరిస్తారు ?

జవాబు : సత్యసాయి జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలే తప్ప పెద్ద పరిశ్రమలు లేవు. ఒక్క కియా పరిశ్రమ మినహాయిస్తే మిగతా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వంద లోపే ఉంటాయి. అవి కూడా ఎక్కువగా హిందూపురం పట్టణ పరిధిలోనే ఉన్నాయి. ప్రధానంగా మూడు రకాలుగా కాలుష్యంపై వర్గీకరణ ఉంటుంది. ఎక్కువగా కాలుష్యం పెద్ద పరిశ్రమలలో వ్యాపిస్తుంది. దీనిని రెడ్ క్యాటగిరి అంటాం. మధ్యతరహా పరిశ్రమలను ఆరెంజ్ కేటగిరి అంటాం. మూడవది గ్రీన్ పొల్యూషన్. నూతన సత్యసాయి జిల్లాలో గ్రీన్ పొల్యూషన్ పరిశ్రమలుగా పరిగణిస్తున్నాం.

ప్రశ్న : కాలుష్య నివారణకు ప్రజలకు మీరిచ్చే సలహాలు సూచనలు ఏమిటి ?

జవాబు : కాలుష్యం అనేది ఒక పరిశ్రమల నుంచే రాదు. మన పరిసరాలు పరిశుభ్రత లోపించినా కాలుష్యం వెదజల్లుతుంది. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులు తదితర వస్తువులు వాడకూడదు. దీనివల్ల కూడా కాలుష్యం వ్యాపిస్తుంది. ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించింది. అయినప్పటికీ, దుకాణదారులు విక్రయిస్తున్నారు. ప్రజలు వినియోగిస్తున్నారు. వినియోగించిన వాటిని దిబ్బలలో పారవేస్తున్నారు. వాటిని మూగజీవాలు తిని అనారోగ్యం పాలవుతున్నాయి. అంతేగాక దిబ్బలలోని ఎరువుతో పాటు ప్లాస్టిక్ వస్తువులు పొలాలకు చేరుతున్నాయి. వాటివల్ల రసాయనాలు వెదజల్లి పంటలకు కూడా కాలుష్యం సోకుతోంది. తద్వారా ఆ పంటల నుంచి



వచ్చిన ధాన్యం, పంట్లను మనం తిని అనారోగ్యానికి గురవుతున్నాం. అందుకే ప్రజల్లో చైతన్యం రావాలి. మొక్కలు విరివిగా పెంచి పరిరక్షించాలి. అడవులను రక్షించుకోవాలి. అప్పుడే మంచి గాలి పొందుతాం.

ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా? జిల్లాలో మీ కార్యాలయం ఎక్కడ ఉంది ?

జవాబు : సిబ్బంది కొరత ఉంది. ఇద్దరు ఏఈ లకు గాను ఒక ఏఈ మాత్రమే ఉన్నారు. నూతనంగా ఏర్పడిన సత్యసాయి జిల్లాలో కార్యాలయం లేదు. అనంతపురం నుంచి పర్యవేక్షిస్తున్నాం. తగిన సిబ్బందితోపాటు నూతన జిల్లాలో కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సివుంది.

ఆగని అక్రమ నిర్మాణాలు



ఎన్టీఆర్ కాలనీలో అక్రమంగా నిర్మాణం చేస్తున్న భవనం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలు ఆగడం లేదు...చివరకు మున్సిపల్ ఆస్తులను సైతం కౌన్సిల్ సమావేశంలో ఆమోదం చేసి దారదత్తం చేస్తున్నారు. దీంతో పురపాలికకు భారీగా ఆదాయం గండి పడుతున్నది. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకోవాల్సిన వార్డు ప్లానింగ్ సెక్రేటరీలు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు, కొంత వార్డు ప్రజాప్రతినిధులకు కలెక్షన్ ఏజెంట్లు మారినట్లు వార్తులు వినపిస్తున్నాయి. దీంతో పట్టణ ప్రణాళిక విభాగం పేరుకే ఉన్నట్లు విమర్శలు వినపిస్తున్నాయి.

హిందూపురం పురపాలక సంఘంలో పట్టణ ప్రణాళిక విభాగం పేరుకే అన్నట్లు మిగిలి పోతోంది. ఇక్కడ ఎవరూ పనిచేసేవారు లేరు. వచ్చిన వారంతా కేవలం దండుకోవడానికి మాత్రమే పరిమితమవుతున్నారు. అదికారులు పూరి స్తాయిలో సిబ్బందిని నియమించక పోవడం, దీన్ని అవకాశంగా తీసుకొని సొంత బొక్కసాలు నింపుకోవడం నిత్యకృత్యంగా మారింది. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే ప్లానింగ్ సెక్రేటరీలు పూర్తి స్థాయిలో విధులు నిర్వహిస్తే పురపాలక సంఘం వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలతో పాటు మున్సిపల్ రిజర్వు స్థలాలను పరీరక్షణ చేయడానికి అవకాశాలు ఉన్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే కొంత మంది ప్లానింగ్ సెక్రేటరీలు అక్రమ నిర్మాణాలు గుర్తించినప్పటికి చర్యలు తీసుకోవడం లేదు. కేవలం అక్రమణలు, అనుమతులు లేని నిర్మాణాలను గుర్తించడం, వారికి నోటీసులు ఇవ్వడం, చేతులు దులుపుకోవడం పరిపాటిగాఆ మారింది. దోచుకున్నోడికి దోచుకున్నంత' అన్న చందంగా ఉంది. హిందూపురం పురపాలక సంఘంలో కొంత మంది సిబ్బంది కాసులకు కక్కుర్తిపడి అనుమతుల మాటున అడ్డగోలు నిర్మాణాలకు పచ్చజెండా ఊపుతున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఒక భవన నిర్మాణానికి ప్లాన్ పొందాలంటే ప్రభుత్వ ఖజానాకు కనీసం రూ.60 వేలు చలానా చెల్లించాలి. కానీ అక్రమార్కులు టౌన్‌ప్లానింగ్ విభాగంలో కొంతమందికి మామూళ్లు ఇచ్చి ప్రసన్నం చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో అనుమతులు లేకుండానే అవినీతి పునాదులపై అంతస్తులు నిర్మిస్తున్నారు. పట్టణంలో ఎటువంటి అనుమతులు లేకుండా అనేక భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. దీనికి అధికార పార్టీకి చెందిన కొంత మంది కౌన్సిలర్లు సహకరిస్తున్నట్లు సమాచారం. అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత ప్లాన్ అప్రూవ్ కాకుండానే భవన నిర్మాణాలు



పట్టణ ప్రణాళిక విభాగం

పూర్తవుతున్నాయి. కొందరు కనీసం అనుమతి కోసం దరఖాస్తు చేయకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు.

తెర వెనుక నాయకులు...

హిందూపురం పురపాలక సంఘంలో కొన్నేళ్లుగా కొనసాగుతున్న అక్రమ కట్టడాల వెనుక అధికార పార్టీకి చెందిన కొంత మంది అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ల హస్తం ఉన్నట్లు సమాచారం. అధికార పార్టీకి చెందిన వారిలో కొంత మంది పాలకులను ప్రసన్నం చేసుకుంటే మున్సిపల్ రిజర్వు స్థలంలో అయిన నిర్మాణాలు చేసుకోవాడానికి అనుమతులు లభిస్తున్నాయి. దీనికి నిదర్శనం సిండికేట్ ఫార్మ సోసైటికి చెందిన స్థలంలో హల్‌సేల్ మార్కెట్ నిర్వహణకు అనుమతులు, పాత బస్టాండ్, ఇందిరా పార్కులో ఉన్నా సామూహిక మరుగుదొడ్లకు ఇచ్చిన అనుమతులే నిదర్శనం.

మండలంలో కనిపించని ఎన్నికల కోడ్

ప్రజాశక్తి-కనగాన పల్లి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న స్థానిక సంస్థలు,గ్రాడ్యుయేషన్, టీచర్స్ నియెజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రారంభించినా మండల అధికారులు ఆ ఆదేశాలను పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తూన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన వెంటనే ప్రభుత్వం ప్రచార హోర్డింగ్‌లు తొలిగించాలి, అదే విదంగా నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలి. కానీ కనగాన పల్లి మండలం లో ఎన్నికల కోడ్ వర్తించదన్న చందగా అధికారులు వ్యవహరిస్తున్నారు. అందుకు ఉదాహరనే మండల పరిధిలోని బానుకోట సచివాలయం ఎదురుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు హోర్డింగ్ యథాతథంగా ఉంచారు. అదే విదంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాన్ని ఎటువంటి ముసుగు వేయలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నికల నియమాలను పాటించని అధికారులు ఎన్నికల నిర్వహణ ఏమాత్రం చేపడతారని సిపిఎం మండల కార్యదర్శి బత్తల కదిరప్ప విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలో ఎన్నికల కోడ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.



భానుకోట సచివాలయం వద్ద ముఖ్యమంత్రి ఫొటోతో ప్రచారం బోర్డు

ఫుట్‌బాల్ క్లబ్ రన్నర్‌గా పరిగి సౌత్ జట్టు

పరిగి : హిందూపూర్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో పరిగి సౌత్ జట్టు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎస్‌డిజి ఎస్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన టోర్నమెంట్లో పరిగి సౌత్ జట్టు రన్నర్స్‌గా నిలిచినట్లు పరిగి ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కార్తీక్ తెలిపారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ధర్మవరం టౌన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారాలోకేశ్ చేపడుతున్న యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని ధర్మవరం పట్టణంలోని 10వ వార్డు టీడీపీ ఇన్చార్జ్ క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.కర్నాటకలోని మురగమాల దర్గాలో అమ్మాజాన్ బావాజాన్ స్వామి వారి సన్నిధిలో ఆయనతో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇర్షాద్ తదితరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పకడ్బందీగా జొన్న కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జొన్న కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ నీలిమయ్య సూచించారు. ఆదివారం విడపనకల్లు మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో జొన్నల కొనుగోలు నిర్వహణపై మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, తహశీల్దార్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.2,990 మద్దతు ధరతో జొన్నపంటను కొనుగోలు చేసేందుకు నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా జొన్న పంట సాగు చేసిన వివరాలను రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. తర్వాత కొట్టాలపల్లి, విడపనకల్ సహకార సొసైటీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో సోమవారం నుంచి జొన్నలు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో చిరుధాన్యాల ఆవశ్యకతను రైతులకు వివరించాలన్నారు. అలాగే జొన్నల్లో తేమశాతం 14 ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పర్వతప్ప, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గోవిందరెడ్డి, వీఆర్వోలు, రైతు భరోసా, సొసైటీల సిబ్బందిపాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహాళ్ కోఆపరేటివ్ సొసైటీలో చిరుధాన్యాల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ నీలిమయ్య మాట్లాడుతూ రైతులు పండించిన జొన్నలు, రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాలను కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం ఉద్దేహాల గ్రామంలో కోఆపరేటివ్ సొసైటీలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంటలు సాగు చేసిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని మద్దతు ధరతో పంటను అమ్ముకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి అహ్మద్‌బాషా, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన

నార్పల : సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, ట్రాఫిక్ నియంత్రణపై ఎస్ఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా ఆడపిల్లలకు 18 సంవత్సరాల్లోపు వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. చదువుకునే పిల్లలకు తల్లిదండ్రులు బలవంతంగా పెళ్లి చేయాలని చూస్తే చైల్డ్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అదేవిధంగా ఇటీవల కాలంలో సైబర్ నేరాలు కూడా అధికమయ్యాయన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లు చేసి మీ ఆధార్ నెంబర్లు, బ్యాంక్ అకౌంట్‌లు అడిగితే చెప్పకూడదన్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఎలాంటి సమాచారమైనా సమీపంలోని బ్యాంకులకు స్వయంగానే వెళ్లి అధికారులతోనే తెలుసుకోవాలని సూచించారు.

28 నుంచి ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభం

పెద్దపప్పూరు : మండలంలోని ముచ్చుకోట గ్రామం నుంచి ఈనెల 28వ తేదీ నుంచి ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభం కానున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మొదటి విడుతగా పాదయాత్ర చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించిన విషయం తెలిసిందే అన్నారు. ఈనేపథ్యంలో రెండవ విడత ఈనెల 28న నియోజకవర్గంలోని పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటలో ఉదయం 8 గంటలకు ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభం కానున్నట్లు తెలిపారు. దాదాపు 11 రోజులపాటు మండలంలో సుమారు 100 కిలోమీటర్ల మేర యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో ప్రజలు భాగస్వామ్యులై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విజ్ఞాన ఉత్సవాల్లో సత్తా చాటిన ఎపిఆర్ఎస్ విద్యార్థి

పరిగి : మండలంలోని కోడిగెనహళ్లి గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి అశోక్ కర్నాటక రాష్ట్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ఉత్సవాలు పాల్గొనేందుకు అవకాశానికి దక్కించుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్ బాబు తెలిపారు. ఐఆర్ఎస్ గ్రూప్ డైరెక్టర్ ప్రొఫెసర్ హరినాథ శర్మ సహకారంతో ఈ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అశోక్ పాల్గొన్నట్లు తెలిపారు. శనివారం గౌరీబిదనూరులోని హెచ్ఎన్ కళాభవన్‌లో " విశ్వ మానవ హితానికి విశ్వ విజ్ఞానం " అనే ఇతివృత్తంతో నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్న అశోక్ అందరి మన్ననలను పొందాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మశ్రీ, పద్మ విభూషణ అవార్డు గ్రహీత, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వైస్ ఛాన్సలర్ సురేష్ నుండి అశోక్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. ప్రతిభా విద్యార్థిని, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు నాగమోహన్‌ను పాఠశాల ప్రిన్సిపల్ మురళీధర బాబు, పాఠశాల సిబ్బంది అభినందించారు.



ప్రతిభా విద్యార్థి అశోక్‌ను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్.

పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో మార్చి 5న యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచితకంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు వైకె శ్రీనివాసులు, కార్యదర్శి సుంకు సుకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు కంటి వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదలచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కర్నూల్‌కు చెందిన శ్రీచక్ర ఆస్పత్రివారిచే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాంప్ చైర్మన్ చాంద్ భాష వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి రాధాక్రిష్ణ, సభ్యులు డాక్టరుబ్బారావు, పోలాప్రభాకర్, పీఆర్డీ జయరాం, వాసుదేవుడు, బండి నాగేంద్ర, నామాల శ్రీనివాసులు, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కష్టపడేవారికి పార్టీలో ప్రాధాన్యం

కనగానపల్లి : తెలుగుదేశం పార్టీ కోసం కష్టకాలంలో కూడా ధైర్యంగా పని చేస్తున్న నాయకులను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. నెట్టెం వెంకటేష్ కు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన నేపథ్యంలో ఆయన పరిటాల సునీతను ఆదివారం కలిశారు. తనకు పదవి వచ్చేలా చొరవ తీసుకున్న పరిటాల సునీతమ్మ చేసిన సాయాన్నిమరువలేమన్నారు. ఆ తరువాత కార్యకర్తలు, నాయకులు వెంకటేష్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత నెట్టెం వెంకటేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమం లో మండల నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు మహిళలు పాల్గొన్నారు.

రజక మహాసభను విజయవంతం చేయండి

గోరంట్ల : పట్టణంలో మార్చి ఒకటో తేదీన షాదీ మహల్ నందు నిర్వహించబోయే రజక గర్జన మహాసభకు మండలంలోని రజకులు హాజరై సభను విజయవంతం చేయాలని రాష్ట్ర రజక సాధికారత సమితి డైరెక్టర్ రామచంద్ర కోరారు. ఈ సందర్భంగా ఆయన రామచంద్ర మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. రాయలసీమ జిల్లాలో రజకుల పిల్లల కోసం గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని, రజకులకు పనిముట్లు ఇవ్వాలి 40 సంవత్సరాలు నిండిన రజక వత్తిదారులకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. రజక గర్జన మహాసభకు మండలంలోని రజకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు





నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో నవ్యశ్రీ సాయి ప్రతిభ

పెనుకొండ : పట్టణంలోని శివసాయి మందిరం వ్యవస్థాపకులు డాక్టర్ సాయి కాళేశ్వర్ కుమార్తె నవ్యశ్రీసాయి ముంబాయిలో జరిగిన నేషనల్ ఈక్వ్యశ్చరియన్ ఛాంపియన్షిప్ 2023లో 2 గోల్డ్ మెడల్స్, 1 సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవ్యశ్రీసాయికి ప్రగతి విద్యాసంస్థల అధినేత శ్రీనివాసులు పుష్పగుచ్చాన్ని అందించి అభినందనలు తెలిపారు. అదే విధంగా పలువురు నవ్యశ్రీకి అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్పా, భాస్కర్ రెడ్డి, నాగిరెడ్డి, ఆశ్రమ సిబ్బంది హరి, చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు

ప్రజా నాయకులను శాసనమండలికి పంపుదాం

పుట్టపర్తి రూరల్ : ప్రజా సమస్యలపై శాసనసభలో గళమెత్తే నాయకుడినే ఎమ్మెల్సీగా శాసన సభకు పంపుదామని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మద్దతుగా పుట్టపర్తిలోని సిపిఎం కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఇంతియాజ్, ఇఎస్. వెంకటేష్, బడా సుబ్బిరెడ్డి, ప్రవీణ్ కుమార్, నాగేంద్రప్రసాద్, పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల. టీచర్స్, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మద్దతుగా పనిచేయాలని సిపిఎం నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పైపల్లి గంగాద్రి, పెనుగొండ రమేష్, గౌస్లాజీమ్ ,ఆమడగురు లక్ష్మీనారాయణ, జంగాలపల్లి పెద్దన్న, పెడపల్లి బాబావలి, జిఎల్ నరసింహులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

లేపాక్షి : మండల కేంద్రంలోనిమహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల ముందు హిందూపురం, చిలమత్తూరు వెళ్లే ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. బిసలమనేపల్లికి చెందిన బసవరాజు (55) లేపాక్షిలో పని ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా చిలమత్తూరు మండలం చాగలేరు కు చెందిన వెంకటరమణప్ప,అశ్వర్తన్నారాయణప్ప మరో ద్విచక్రవాహనంలో ఎదురుగా వస్తున్న సమయంలో ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బసవరాజును హిందూ పురం ఆసుపత్రికు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటం తో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరో ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఇందిరమ్మకాలనీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి గ్రామానికి చెందిన శివకుమార్ పనినిమిత్తం ధర్మవరానికి ద్విచక్రవాహనంలో వచ్చాడు. పనులు ముగించుకు తిరిగి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తూ మార్గమధ్యలో ఇం దిరమ్మకాలనీ వద్దకు రాగానే బైకు అదుపుతప్పి కిందకుపడ్డాడు. ఈ ప్రమాదంలో శివకుమార్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు ఆటోలో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం : ఎస్పీ

కదిరి టౌన్ : ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్నామనిఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పేర్కొన్నారు. కదిరి పట్టణం లో శనివారం చోటు చేసుకున్న పరిణామాలపై ఆయన ఆదివారం కదిరి వచ్చారు. ఆలయం మాడ వీధిలో ముందర తొలగించిన దుకాణాల ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘటనకు కారణమైన ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని చెప్పారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డిఐజి సెల్ కాన్ఫరెన్స్

పుట్టపర్తి రూరల్: అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాలలోని సిఐలు, ఆపై స్థాయి పోలీసు అధికారులతో రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్ ఆదివారం సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్ధేశం చేశారు. పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేశారు. రాజకీయాల జోలికెళ్లకూడదని చట్టపరంగా కాకుండా స్వార్థంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొలికిలో గడ్డివాములు దగ్ధం

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని పొలికి గ్రామంలో ఆదివారం నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. దీంతో దాదాపు 3 లక్షల వరకూ నష్టం సంభవించిందని రైతులు వాపోయారు. వివరాల్లోకి వెళ్తే.. పొలికి గ్రామానికి చెందిన సుధాకర్, ఓబులేసు, అంజినమ్మ, మంజుకి చెందిన నాలుగు వాముదొడ్లకు ఆదివారం మధ్యాహ్నం ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయగా గుంతకల్లు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. రూ.వేలు వెచ్చించి పశువులకు పశు గ్రాసం కొని వాము దొడ్లు వేసుకుంటే ఇలా జరగడంతో పశువులకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి : సిఐ జాకీర్

అనంతపురం సిటీ : నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస చోరీలు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ జాకీర్‌హుస్సేన్ సూచించారు. ఆదివారం నగర సమీపంలోని ఎ.నారాయణపురం ఇందిరమ్మ కాలనీలో పర్యటించి వరుస చోరీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతాల్లో రాత్రిళ్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు తమ ప్రాంతాల్లో పర్యటిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయా కాలనీల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిని నిరంతరం గమనిస్తూనే ఉండాలన్నారు. ఇందుకోసం సచివాలయం పరిధిలో ఒక పోలీస్‌ను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. వారు ఆ సచివాలయం పరిధిలో జరిగే నేరాలు, సామాజిక కార్యక్రమాలకు విఘాతం కలిగించే వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురానున్నట్లు తెలిపారు.

రైల్వే శాఖ అనుమతే తరువాయి..!

చెన్నై నుంచి అనంతకు చేరుకున్న భారీ క్రేన్

త్వరలోనే ఆర్‌ఒబి వద్ద గడ్డర్ల లాంచింగ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలో జాతీయ రహదారి విస్తరణ పనులు కీలక దశకు చేరుకున్నాయి. నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఒబి) పనులు పూర్తి చేయడంలో భాగంగా చెన్నై పోర్టు నుంచి భారీ క్రేన్ (700 టన్నులు) ఆదివారం అనంతపురం చేరుకుంది. ఇప్పటికే బ్రిడ్జికి ఓ వైపు సర్వీస్ రోడ్డు పనులు పూర్తి కాగా మరోవైపు డ్రెయిన్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. అదేవిధంగా అండర్ పాస్ పనులు కూడా సాగుతున్నాయి. త్వరలోనే స్టీల్, సిమెంట్ గడ్డర్ల లాంచింగ్ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ గడ్డర్ల లాంచింగ్ కోసం భారీ క్రేన్ అనంతపురం చేరుకోవడంతో రైల్వే శాఖ అనుమతుల కోసం ఎదురు చూస్తున్నారు. అనుమతి వచ్చిన వెంటనే ఈ పనులు పూర్తి చేయనున్నారు. ఈ విషయంపై ఇప్పటికే రైల్వే ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో పాటు అధికారులు చర్చిస్తున్నారు. రెండ్రోజుల్లో అనుమతులు వచ్చే అవకాశం ఉంది. గడ్డర్ల లాంచింగ్ కాగా 45 రోజులకు దాదాపు రెండు వైపులా బ్రిడ్జిల నిర్మాణం పూర్తికానుంది. ఆ తర్వాత ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జిని అందుబాటులోకి తేనున్నారు.

ఓట్ల రాజకీయాలు...

ప్రజాశక్తి - మడకశిర రూరల్

బంజారాల సుగాలీలను ఓట్ల కోసమే నాయకులు ప్రభుత్వాలు వాడుకొంటూ వారి సమస్యలు పట్టించుకోవడంలేదని సుగాలి జిల్లా సంఘం నాయకుడు శ్రీరామ్ నాయక్ అన్నారు మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సంత్ శ్రీశ్రీశ్రీ సేవలల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బంజారి సుఖాలి లు డప్పు వాయిద్యాలు స్టెప్పులు వేస్తూ వైభవంగా ఊరేగింపు యాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారుల సుగాలీల సమస్యలు ఏ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు భాగంగా బంజరులు సుఖాలు లంబాడీలను ఐక్యమత్తమై ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ నాయక్, లింగ వెంకటేష్ నాయక్, బంజార సుగాలీలు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

దేశంలో ఎక్కడా లేని విధంగా హిందూపురం పట్టణంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతులు శ్రీ పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఛత్రపతి శివాజీ మాజరాజ్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన శోభాయాత్రలో ముఖ్యఅతిథిగా కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతులు శ్రీ పరిపూర్ణానంద స్వామి పాల్గొన్నారు. అంతకు ముందు త్యాగరాజ్‌నగర్‌లో నూతనంగా నిర్మాణం చేసిన నర్మదనంద ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని సుగురు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి బెంగళూరు రోడ్డు, మెయిన్ బజార్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా మేళాపురం వరకు శోభయాత్ర కొనసాగించారు. ఆంజనేయస్వామి ఆలయంలో మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ శోభాయాత్రలో మహిళలు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ భారతదేశంలో హిందూ అనే శబ్దంతో ఉన్న ఊరు హిందూపురం అన్నారు. ఈ పట్టణంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా అతిపెద్ద చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. చత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేయాలని చూస్తే ఎన్నికలు కూడా అమలులో ఉన్నందున అధికారులు నిరకరించారన్నారు. ఎన్నికల కోడ్ రాజకీయ నాయకులు వారి విగ్రహాలకు ఉండాలి, దేశం కోసం పోరాడిన శివాజీకి ఎందుకని ప్రశ్నించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా హిందూపురం పట్టణంలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ ట్రస్ట్ కార్యదర్శి రమేష్ రెడ్డి, వివిధ కుల సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

సిఐ మధుపై చర్యలకు డిమాండ్



కదిరిలో బైక్‌ర్యాలీతో నిరసన



తనకల్లులో టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-కదిరి అర్బన్

తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలపై లాఠీఛార్జి చేసి గాయపరచిన కదిరి పట్టణ సిఐ మధును తక్షణమే సస్పెండ్ చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారథి డిమాండ్ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని లక్ష్మినరసింహ స్వామి దేవాలయం వద్ద దుకాణాల తొలగింపులో టిడిపి కౌన్సిలర్ సుధారాణి, సిఐ మధు మధ్య శనివారం రాత్రి వాగ్వాదం, టిడిపి కార్యకర్తలపై లాఠీఛార్జి జరిగిన విషయం విధితమే. పోలీసుల లాఠీఛార్జీలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలను శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారథి, మాజీ మంత్రులు పరిటాల నీత, పల్లె రఘునాథరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టిడిపి నాయకులు, కార్యకర్తలను లాఠీలతో కొట్టి గాయపరచిన సిఐ మధును వెంటనే సస్పెండ్ చేయాలని, మహిళా కౌన్సిలర్‌ను దుర్భాషలాడిన సిఐ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గాయపడిన టిడిపి కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ దాడిలో పాల్గొన్న వైసిపి నాయకుల మీద హత్యాయత్నం కేసులు పెట్టి వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, కదిరి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఐ మధుపై చర్యలు తీసుకోవాలి

మహిళా కౌన్సిలర్‌ను దుర్భాషలాడడమే కాకుండా, సిఐ ఇంటి ఎదుట నిరసన తెలిపేందుకు వెళ్లిన టిడిపి నాయకులు, సత్యసాయి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు షేక్ బబ్జాన్, మహిళా కార్యకర్తలపై లాఠీ ఛార్జి చేసి గాయపరచిన కదిరి పట్టణ సిఐ మధుపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పెనుకొండ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పుల్లప్ప చౌదరి జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి జావిద్ బాషా విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన పరిణామాలను చూస్తే సిఐ మధు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉంటూ వైసిపి ప్రభుత్వానికి తొత్తులా వ్యవహరిస్తున్నాడన్నారు. తక్షణమే సిఐ మధుపై చర్యలు తీసుకోవాలని, దాడి గురైన టిడిపి కార్యకర్తలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తనకల్లు: మండల కేంద్రంలోనీ మహిళా మండలి టైలరింగ్ కేంద్రంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ శనివారం రాత్రి కదిరి పట్టణంలో కదిరి పట్టణ సిఐ మధు మహిళలపై దూషిస్తూ, దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని విమర్శించారు. ఎక్కడ చూసినా తెలుగుదేశం శ్రేణులపై పోలీసులచేత దాడులు చేస్తే భయభ్రాంతులకు గురిచేస్తుందని, ఇటువంటి బెదిరింపులకు భయపడవని హెచ్చరించారు.మండల తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గన్నవరం సంఘటన మరువకముందే మహిళలపై ఈ దుర్మార్గమైన ఘటన చోటు చేసుకుందన్నారు. కదిరి నగరంలో పట్టణ సిఐ మధు మహిళలసౌ దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు ఆనంద రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు హరినాయక్,నాగరాజు, ఉత్తన్న నాయక్, దామోదర్, శంకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా పని చేస్తున్న మీడియా ప్రతినిధులపై పట్టణ సీఐ మధు చేసిన దాడి హేయమైన చర్యని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్ తెలిపారు.శనివారం రాత్రి పట్టణంలో టిడిపి, వైసిపి నాయకులు ఒకరిపై ఒకరు చేసుకుంటున్న దాడులను చిత్రీకరిస్తున్న సమయంలో సీఐ మధు వ్యవహరించిన తీరును ఆయన ఖండించారు. మీడియా ప్రతినిధుల పైనే సీఐ వ్యవహార శైలి ఇలా ఉంటే సామాన్య వ్యక్తులపై ఎలా ఉంటుందో పై అధికారులు ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు ఇలాంటి సంఘటనలను పునరాగం కాకుండా సిఐని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎస్పీకి ఫిర్యాదు చేసిన మీడియా ప్రతినిధులు : పోలీసులు పత్రిక ప్రతినిధులు స్నేహభావముతో మెలిగి ఉండేవారమని ,ఎప్పుడైతే కదిరి ప్రాంతంలో సిఐ మధు విధులను చేపట్టారోఅప్పటినుంచి ఒకే వర్గానికి కొమ్ముకాస్తూ రౌడీయిజాన్ని ప్రేరేపిస్తూ సామాన్య ప్రజలకు సైతం ఇబ్బందులు పెట్టే పరిస్థితి ఏర్పడిందని స్థానిక పాత్రికేయులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి పట్టణంలో టిడిపి, వైసిపి నాయకులు ఒకరిపై ఒకరు చేసుకుంటున్న దాడులను చిత్రీకరిస్తున్న సమయంలో సిఐ మధు వ్యవహరించిన తీరును ఎస్పీకి వివరించారు. మీడియా ప్రతినిధుల పైనే సిఐ వ్యవహార శైలి ఇలా ఉంటే సామాన్య వ్యక్తులపై ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి సంఘటనలను పునరావృత్తంకాకుండా సిఐ తమ్మిశెట్టి మధుపై చర్యలు తీసుకొని మీడియా ప్రతినిధులకు న్యాయం చేయాలని వారు ఎస్పీని కోరారు.

టిడిపి మహిళా కౌన్సిలర్ ఫిర్యాదు : కదిరి పట్టణంలో శనివారం శ్రీమద్ ఖాద్రి లక్ష్మి నరసింహస్వామి ఆలయం ముందర దుకాణాల ఆక్రమణలో తొలగింపు ఘటనలో చోటు చేసుకున్న పరిణాలపై టిడిపి కౌన్సిలర్ ఎస్పీకి సిఐ మధుపై ఫిర్యాదు చేశారు. స్వచ్ఛందంగా తొలగిస్తామని దుకాణ యజమానులు చెప్పినప్పటికీ వినకుండా అవార్డు కౌన్సిలర్ అయిన తనను కూడా లెక్కచేయకుండా వ్యవరించారని ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కనగాన పల్లి : కదిరి పట్టణ సిఐ మధు శాంతి భద్రతలు కాపాడాల్సింది పోయి వైసిపి కార్యకర్తలాగా వ్యవహరిస్తున్నారని టిడిపి మహిళా విభాగం నాయకులు విమర్శించారు.కదిరి పట్టణ సిఐ మధును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈకార్యక్రమములో సుకన్య రాప్తాడు ప్రధాన కార్యదర్శి, రాములమ్మ కనగానపల్లి మండల మహిళ అధ్యక్షురాలు, అనిత రాప్తాడు సోషల్ మీడియా కోఆర్డినేటర్, అరుణ కార్యనిర్వాహక కార్యదర్శి, స్రవంతి కనగానపల్లి మండల కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : సిఐ మధు పై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలుగు యువత నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జిల్లా తెలుగు యువత నాయకులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన పరిణామాలు చూస్తే సిఐ మధు వైసిపికి తొత్తుగా మారాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పుల్లప్ప చౌదరి, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి జావిద్‌బాషా, మైనార్టీ నియోజక వర్గ అధ్యక్షులు రియాజ్ బాషా, టిఎన్ఎస్ ఎఫ్ షబ్బీర్‌బాషా, తెలుగు యువత ప్రశాంత్, ఉపేంద్ర చౌదరి, సాధిక్, రఫీ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు



కనగానపల్లిలో మాట్లాడుతున్న తెలుగు మహిళా నాయకులు